శిథిలహృదయాలు

శ్రీ భమిడిపాటి సోమసుందరశాస్త్రి

పూర్వకాలంలో మనవాళ్లు చెప్పిన జాతకాలు ఫలించేవి. అప్పుడు మనపూర్వులుచేసిన మహానిష్ఠలూ, వంశాచారాలూ, వర్ణగౌరవాలూకూడా కారణాలై వుండవచ్చును. ఇప్పుడవన్నీ నశించగా జాతకాలు మట్టుకు మిగిలాయి. ధనలోభంచేత ప్రతీజోస్యమూ మంచినే చెప్పడం – ఉన్నా లేకపోయినా. పైగా జోస్యుడి అశక్తతకూడా ఒక ముఖ్యకారణం అయి వుంటుంది సాధారణంగా ఇప్పటి జాతకం నిజం కాక పోవడానికి. కొందరు జ్యోతిష్కులు – అబద్ధం అవుతుం దన్న భయంచేతో – నిజం చెబితే ఎక్కడ కష్టపడతారో అని చెప్పరు. మా నాన్నకూడా ఒక జ్యోతిష్కుడు. అటువంటివాడే ... ఎవరికీ సాధారణంగా చెప్పడు. ఒకచోట చెబితే రైటైందేమో. అందుచేతే పేరు వచ్చి వుంటుంది.

*　　*　　*

ఆమెకు చిన్నతనాన్నే జాతకం చూపించారు. ఆ జోస్యుడు ఆమెజాతకంలాంటి జాతకం మరెక్కడా చూడలేదనీ, ఆమె మహాసుఖం అనుభవిస్తుందనీ, సంతానవంతురా లవుతుందనీ, భర్త గొప్ప వుద్యోగస్థుడవుతాడనీ ఇంకా యెన్నో మహాసంగతులను వ్రాచ్చాడు. అందుచేత "మన అమ్మాయికి ఎక్కడి సంబంధం వచ్చినా ఒక్కలాగే నడుస్తుంది. అదీ మన-దాని-అందరి-అదృష్టమే" అని భావించారు ఆమెనాన్నగారు. ప్రతీచోటా తమకూతురిజాతకమే వర్ణిస్తూ, ప్రతీచోటా ఆమె సౌందర్యమే వర్ణిస్తూ-కాలంగడిపారు ఆమె తల్లిదండ్రులు.

ఆజోస్యుడు అమ్మాయి పుట్టింటి సంగతులు చెప్పాడు. అవి అన్నీ ఇంచుమించు నిజమే. ఆమె మహాశాంతవంతురాలు. ప్రశాంతహృదయ, అమాయక జీవి. అసాధారణ సౌందర్య. ధర్మబుద్ధిగలది. పతివ్రత......

అమ్మాయికి పెళ్లి అయి నాలుగేళ్లయింది. అత్తవారింటికి కూడా వెళ్లిపోయింది. అప్పట్నుంచీ తమకూ వాళ్లకూ దెబ్బలాటలే. దేవుడు వరం ఇచ్చినా పూజారి ఇవ్వడన్నట్టు అల్లుడు మంచివాడయినా అత్తగారూ మామాగారూ కోడలిని పుట్టింటికి పంపేవారు కారు. అల్లుడు ఏవుద్యోగం చెయ్యకుండా ఇంటి దగ్గరే కూర్చున్నాడు కనక అందరికీ లోకువయ్యాడు......

ఆమె తనకు ఒకర్తే సంతానం. పోనీ కూతురినీ, అల్లుణ్ణీ తన దగ్గిరకే తెచ్చుకుందామంటే ఆకుర్రాడు కూడా వాళ్లకు ఏకైకపుత్రుడు, కాని అమ్మాయికి ఆమె సవతి అత్త...అదేవాళ్ల దెబ్బలాటలకు ముఖ్య కారణం. స్త్రీ తలుచుకుంటే లోకాలన్నీ నాశనం చేస్తుందన్నమాట వుత్తదవుతుందా?

తాను ఒక్కసారీ తనకూతురిని కరువు దీరా చూడలేదు కదా అని విచారించాడు. ఇంకా అప్పటి జ్యోతిష్కుడి మాటలు ఆయనతల్లో వున్నాయి ఎండా వానలకు సహించి.కృశీభూతుడైనా-ఆ అమ్మాయి రూపాన్ని మనస్సులో సంస్మరించు-ఆ ఆశతోటే సజీవుడై యున్నాడు ఆయన.

*　　*　　*

"సుగుణా! ఎందుకీవేళ అంతభారంగా వున్నావో నాకు చెప్పవూ? ఎందుకూ, అంత కష్టపడి ఆ పనులు చెయ్యకపోతే యేం?...కొంతసేపు విశ్రాంతి తీసుకోకూడదూ?"

"నే నెల్లా వున్నానూ?......మామూలుగానే వున్నాను. నాకు మీరు అల్లా వుండడం కావాలిగాని, ఇంతకన్నా ఏ సుఖం కావాలి నాకు చెప్పండీ?"

"ఏం సుఖం పడుతున్నావు సుగుణా? ఇంకా అల్లా అంటావు. మా అమ్మ నిన్ను పెట్టే బాధలు అన్నీ చూస్తే—"

"అయ్యో—పాపం ఆవిడ నన్నేమీ అనడం లేదే? ఆవిడ చాలా మంచిమనిషి. ఆవిడ నేమీ అనకండి. పాపం వస్తుంది. లేనిపోని మాటలన్నీ అనుకుంటే ఏమిటిలాభం?"

"ఇంకా యెందుకు సుగుణ్ నాదగ్గిర అబద్ధం ఆడతావూ? నాకు చెప్పవూ నీబాధలు? ఎందుకు దాస్తావూ నాదగ్గిర? నే నెవరితోనూ చెప్పను. నాతోటి చెప్పవూ?"

"నేను ఏంబాధలు పడుతున్నాను చెప్పండి? మీరు అల్లా వుండడంకన్నా నాకు ఏంకావాలి?"

"ఇంతకూ నేను వుద్యోగం సంపాదించలేక—వెధవమెతుకులు తింటూ నిన్ను బాధ పెడుతున్నాను. ఇందుకా నిన్ను కట్టుకుంటా? అబ్బా! నిన్ను ఎంత కష్టపెడుతున్నానూ?"

"అబ్బా? వూరుకోండి. ఇలాంటి ప్రసంగాలే ఎప్పుడూ చేస్తారు. మీరు నన్ను ఏంబాధ పెడుతున్నారూ ? నే నేంబాధ పడుతున్నాను?...ఇంతకూ నన్ను ఇక్కడికి ఇప్పుడు ఎందుకు పిల్చారో?"

"ఎందుకూ లేదు. కాస్తసేపు నాదగ్గిర కూర్చోకూడదూ?...అక్కడేంపని మించిపోతోందీ?"

ఇంతట్లోకి ఆమెఅత్తగారు వస్తుంది–రైలుబండి అంతవేగంతో. "ఇక్కడేం చేస్తున్నావే? అయ్యో, అయ్యో! గదిలో దూరికూచుని మొగుడుగారితో పరిహాసా లాడుతున్నావా? ఎంతటిదానివే! ఎంతటిదానికేనా తగుదువు! ... నే నంటూ ఒకత్తిని ఇక్కడ వున్నాను కనక అంతటితో ఆగావు ... లేకపోతే మొగుణ్ణికూడా బుట్టలో వేసేసే దానివి — ఇప్పటికే వేశావులే! ... అల్లా చూస్తూ నుంచుంటావేం! స్తంభంలాగు?— నీకు కాదూ చెపుతూంటా?" — అతనిపై పుకు తిరిగి — "నీ కేమీ పనీ గినీ లేదూ? — దాని నేంపన్లూ చెయ్యనియ్యవూ? — నే నొక్కత్తినే ఆవంటపొయ్యి దగ్గిర చచ్చేదాన్ని?–ఔర! ఎంతటివాడవౌదువురా!... అస్తమానమూ ఇంట్లో తీరికూర్చుని ఇదా నువ్వుచేసే పనీ?" అని ఒకసాక్షిఉపన్యాసం కొట్టి–గగ్గయ్యలాగు గద్దించింది, "నే నూరుకుంటానూ— నడూ—చూస్తావేం?" అని. అప్పుడామె ఏమీ జవాబు చెప్పకుండా వెళ్ళిపోయింది. ఇంకా ఆవిడనోట్లో ఉద్రేకంతో మిగిలిన ఆశూపన్యాసధా రంతా వాకిట్లో కూర్చున్న తన మొగుడుమీద దులిపేసింది.

ఒకరోజున అతనికి జ్వరం వచ్చింది. భార్యను పిల్చి అన్నాడు. "సుగుణ్! నాకు ఈరోజున ఒంట్లో బాగులేదు. నేను అన్నం తినను. నాకోసం గంజి ఉడకపొయ్యద్దని మహారాణీగారితో చెప్పు ... నాకు కొంచెం మిరియాలకషాయం పట్టుకురా."

వెళ్ళి మిరియాల కషాయం పట్టుకుని వచ్చింది. అది పుచ్చుకొని అన్నాడు.

"సుగుణా! నాదగ్గిర కాస్సేపు కూర్చోవూ? నువ్వు నాదగ్గిర కాస్తసేపు కూర్చుంటే నేను ఎంతో సంతోషపడతాను. నేను చేసిన పాపాలకు పశ్చాత్తాపపడగలుగుతాను. ఒక్క నిమిషం నువ్వు నాదగ్గిర లేకపోతే నేను ఎవరికో ఎంతో బాకీపడ్డానన్నట్టుగా నాహృదయం ఎంతో వేధిస్తుంది...నాదగ్గిర కాస్సేపు కూర్చోవూ? నాతోసంతోషంగా ఈవేళకూర్చోవూ—అబ్బ! ఎంత ఎల్లా చిక్కి శల్యం అయిపోయావూ! సుగుణా!"

అతను పడకకుర్చీలో జారగిలపడిపోయాడు... కళ్ళంవెంబడి అశ్రుధారలు కురిశాయి. చొక్కా ముందుభాగం అంతా తడిసింది. ఒక్క నిమిషం కళ్లు మూసుకొన్నాడు...

ఆమె జబాబు చెప్పలేకపోయింది. భర్తయొక్క ఆరోగ్యం బాగులేదనుకొని ఎంతో విచారపడింది...కాళ్లదగ్గర కూర్చుని కాళ్లు పిసకడం మొదలుపెట్టింది...

"చూడండి! ఈవేళ అత్తగారు కందులు వేయించుదామనుకుని, నిన్నరాత్రి తలనొప్పి వచ్చిందన్నారు; అంచేత నన్ను వేయించమన్నారు. పాపం నేను అవి వేయించకపోతే ఆవిడ ఒక్కత్తీ బాధపడరూ?"

"ఆహా! సుగుణా! ఎంతదయార్ద్రహృదయురాలివి!...ఎంత అమాయకజీవివి!...ఎవరుశత్రువులో ఎవరు మిత్రులో తెలిసికోలేవుగదా!" అని మనస్సులో అనుకున్నాడు...పైకి అన్నాడు.

"సుగుణా! నీ వొళ్లు ఎంత వేడిగావుంది! అబ్బ! ఎంత ఆయాసపడుతున్నావూ!...ఎంతనీరసం!...ఆ దిక్కుమాలిన కందులు ఆనిప్పు దగ్గిర కూర్చుని ఈవేళ వేయించకపోతే యేం సుగుణా? ఇల్లారా. దగ్గిరగా కూర్చో. నాకు కాళ్లుపిసకక్కరలేదు." ఆమెజుట్టును తన వేళ్లతో దువ్వడం మొదలెట్టాడు.

"జ్వరంవచ్చినవాళ్లకు కాళ్లు నొప్పి పెడతాయి. అందుకు పిసికాను. పాపం మీ అమ్మ నిన్న రాత్రి కాళ్ల నొప్పిచేత ఎంత బాధపడ్డారు!"

"సుగుణా! ఆపాపిమాట నాదగ్గిర మాట్లాడకు! నాకు నొప్పి పెడుతుంది తల, ఆ పనికిమాలిన సంగతులు వింటేను. నేను శక్తి విహీనుణ్ణి అయిపోయాను గాని లేకపోతే ఆమెను ఈపాటికి ఎంతపనైనా చేసే వాణ్ణి—"కొంచెంసేపు ఆగి—"అబ్బ! సుగుణా! ఎంత నీరసంగా వున్నావు! ఎంత తేజోవిహీనమైవుంది నీశరీరం! ఇంకా నిన్ను ఎవరూ బాధపెట్టడంలేదంటావు. ఇందులో ఏమైనా అర్థం వుందా?...ఎందుకూ నాదగ్గిర దాస్తావూ అవన్నీనీ?"

"ఇంకా యెందుకు పనికిమాలిన ప్రశ్నలు వేస్తారూ? ఒకమనిషికి కావలసిన సుఖం వున్నప్పుడు ఎన్నికష్టాలు పడితేయేం? అవి లెక్కలోకి రావు."

"ఇప్పటికీ చెప్పవుకాదూ, సుగుణ్?...పోనీ నే నొక్క ప్రశ్న అడుగుతాను చెబుతావా?"

"అడగండీ! నేనేమేనా చెప్పనన్నానా?"

"అయితే సుగుణ్ నువ్వు మీవాళ్లయింటి దగ్గిర నుంచి వచ్చి ఎంతకాలం అయిందీ? పదేళ్లుకాదూ?"

"ఔను."

"ఇప్పుడు మీ నాన్న నీకోసం ఎంత బెంగ పెట్టుకుంటాడో నీకు తెలుసునా?"

"అబ్బ! ఆగొడవలన్నీ యిప్పుడు ఎందుకూ? వాటివల్ల ఏం ప్రయోజనం?"

"ప్రయోజనంకోసం అని కాదుసుగుణ్! మనం చేసే దల్లాగూ" లేదు. తల్చుకుంటేయేం?

"చేసేదల్లాగూ లేనప్పుడు తల్చుకొంటే యేం ప్రయోజనం?"

"అయితే తప్పక చేస్తాను...అందుచేత తల్చుకుంటాను."

"అయితే యిదివరకున్న వన్నీ వట్టివే?"

"సుగుణ్! నిజంగా నే నడుగుతున్నాను. ఈ ప్రశ్నకు జబాబు చెప్పు. లేకపోతే నన్ను చంపుకు తిన్నట్టే. నీకు నిజంగా మీ అమ్మనూ–నాన్ననూ చూడాలని వుందా? లేదా?"

"వుంటేయేం? లేకపోతేయేం? నాకు సుఖాన్ని కలగజేసే మీ రల్లా వుంటే చాలు. ఇవన్నీ ఎందుకూ?"

"అల్లా అనకుసుగుణ్. నేను ఈసారి నీకోరిక తీరుస్తాను ... నామనఃపూర్తిగా – త్రికరణశుద్ధిగా – గాయత్రి సాక్షిగా చెబుతున్నాను. నువ్వు నీమంగళసూత్రం సాక్షిగా నిజం చెప్పు! ఇంకా ఎన్ని ఒట్లు పెట్టిస్తావూ నాచేత?"

"అమ్మనూ నాన్ననూ చూడాలని ఏస్త్రీకి బుద్ధి వుండదూ? అది ప్రతీభారతస్త్రీకీ వుండాలి ... లేనప్పుడు స్వరాజ్యంకోసం ఎవరు పాటుబడతారూ?"

"నిజం చెప్పావు, సుగుణ్. చెబుతున్నాను విను. నీసుఖంకోసం అయితేనేం, నాస్వేచ్ఛకోసం అయితేనేం, ఈ తుచ్ఛజీవితంతో కూడిన ఈ గృహాన్ని నేను విడిచేస్తున్నాను."

"అయితే వుద్యోగంకూడా రాలేదుకదా, ఎక్కడికి వెడదామనీ?"

"ఉద్యోగంతో ఏమీ సంబంధం లేదు. నేనూ నువ్వూకూడా మీ పుట్టింటిదగ్గరే వుందాము."

"అటువంటి చొరవ చెయ్యకండి. నామాట వినండి. స్వగృహాన్నీ, తల్లినీ, తండ్రినీ విడిచి వెళ్లడమా! మానవులకు స్వస్థలంలో గౌరవమర్యాలు దక్కుతాయి. ఎల్లాగయినా స్వగృహం గుట్టును దాస్తుందని యెరుగుదురా?"

"నాకు ఏమైనా గుట్టులు వుంటేగా దాగడానికీ. నాకు వుద్యోగం ఏమీలేదని అందరికీ. తెలియనే తెలుసును...నాకు నీమెట్టవేదాంతాలు బోధించకు సుగుణ్. స్వగృహంలోనే గౌరవమర్యాదలు లేనప్పుడు అది 'స్వ' గృహం ఎల్లా అవుతుందీ? ఎక్కడ మనిషికి స్వేచ్ఛాజీవితంతో స్వాతంత్ర్యేచ్ఛ అభివృద్ధి పొందుతుందో అదే స్వగృహం–అంతేగాని ఇటువంటి తుచ్ఛగృహమా 'స్వ'గృహం? కానీ, సుగుణ్! నేను చెప్పినదానికేమీ అడ్డు చెప్పకేం?–ఇది 'నేను' ఆజ్ఞాపించినదని తెలుసునా?"

"అవును. మీరు చెప్పినదానికి అడ్డు చెప్పను."

"మనం అక్కడికి వెళ్లి మన జీవితాంతంవరకూ అక్కడే వుండాలి."

"అవును – జీవిత పథాంతం అక్కడితోనే పూర్తి."

"ఇంక మళ్లీ ఈ పాపులనుగాని, ఈ గృహాన్ని గాని తొక్కకూడదు."

"చూడ్డానికి కూడా కాలం ఇవ్వవద్దు!"

"రక్షించావు సుగుణ్! నేను చెప్పినవి ఏవి తిరస్కరించినా ఆఖరుకు నాప్రార్థన అంగీకరించావు. నువ్వూ నేనూ కూడా వెడితే మీవాళ్లు ఎంతో సంతోషిస్తారు. నన్ను చూసి ఎంత జాలిపడతారూ!...నిన్ను చూసి—చిక్కిపోయిన నిన్ను, శల్యమైన నిన్ను చూసి ఎంత దుఃఖిస్తారూ! అప్పుడు నీకూ నీ ఆరోగ్యానికీ బాధ్యత తీసుకున్న నేను ఇప్పుడు ఏమని జబాబు చెప్పగలనూ ?"

భార్యతండ్రివద్దనుంచి తంతివార్త వచ్చింది.

"చాల జబ్బు; అమ్మాయిని పంపవలె"నని.

తన ప్రయాణాన్ని నిశ్చయం చేసుకుని నాడే బయలుదేరాడు—తల్లి దగ్గిరా తండ్రి దగ్గిరా శెలవు తీసుకుని !

* * *

అమ్మాయీ, అల్లుడూ చేసిన పరిచర్యలచేతనైతేనేం, అమ్మాయిని మళ్లీ చూశానుగదా అన్న సంతోషంచేతనైతేనేం, రోగిజబ్బు నిమ్మళించింది. 'స్వేచ్ఛగా — మొదట్లోకిమల్లే — వుంది శరీరం' అన్నాడు.

"వుద్యోగం లేకపోతే మీ అమ్మచేతా నాన్నచేతా మాటలు పడకపోతే ఇక్కడికి వచ్చెయ్యకూడదుటోయ్."

"నాన్నా, చెబుతున్నాను. విను. ఆయన రోజూ ప్రయాణం అవుతూనే వున్నారు. నేనే ఆపాను."

"అమ్మాయీ! నువ్వు ఎంత చిక్కిశల్యం అయిపోయావూ! ఎంత సౌందర్యాన్ని ఎల్లా నాశనం చేసుకున్నావూ! నీతేజస్సు ఎంతశోభావిహీనమయింది! ఎంత కళారహిత మయిందీ!"

"నాన్నా! నీకు నాబాల్యం జ్ఞాపకం లేదు. నేను ఎప్పుడూ యిల్లాగే వున్నాను..."

తండ్రి జబాబు చెప్పలేకపోయాడు ... భర్త దుఃఖించాడు...

* * *

సుగుణ అంతకంతకూ కృశించిపోయింది ... ఆమెకు ఏదో మనోవ్యాధి పట్టుగుంది. అదే ఆమెను పీడించింది. అది ఎవ్వరూ కనిపెట్టలేకపోయారు. ఆమె భర్త కొద్దిగా గ్రహించినా, ఆమెదగ్గిరనుండి ఆ సంగతులు పూర్తిగా తెలుసుకోలేకపోయాడు...

ఆమె నాటికినాటికీ చిక్కి శల్యం అయిపోయింది. అనేకడాక్టర్లు ప్రయత్నించారు ... విఫలులయ్యారు...

ఆమెరోగం వృద్ధి అయింది. అదికూడా ఆమె తెలియనీయలేదు. మామూలుగానే మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"నాన్నా! నాకోసం మరోపని మానకు. నాకు రోగం తిరుగుమొహం పట్టింది. క్రమక్రమంగా తగ్గుతుంది...నాకోసం బెంగపెట్టుకోకండి ... అధైర్యపడకండి. డాక్టర్లు కుదర్చలేరు —" కొంచెం ఆగి– "మరేమీ భయపడద్దు. రోగం ఇంతకన్నా మితిమీరదు..."

సాయంకాలం కాజొచ్చింది. సూర్యభగవాను డొకమూలనుంచి అస్తమిస్తాంటే–మరొకమూలనుంచి అంధకారం ఆవరిస్తోంది—ఆగి–ఆగి...

ఆమె అన్నది. "నాన్నా! నిజం చెబుతున్నాను. నాకు కాలం సమీపించింది. ఇంక ఆగేదిలేదు. నేను వెళ్లిన తరవాతకూడా ఆయన్ని ఇక్కడ ఉండనియ్యండి ఆయన సుఖంకోసం పాటుబడండి.

"నాకోసం మీరు మీ సౌఖ్య ప్రవాహానికి అడ్డుపెట్టకండేం! నామీద మీరు నిజంగా ప్రేమగలవారు ఔతే ఇక్కడనే ఆగుతారు–ఎల్లకాలమూను..."

తిరిగి ఆ శిథిలహృదయులను చూసి–తన హృదయావేదనచేత అంది.

"అత్తకూ, మామకూ నా నమస్కారాలు చెప్పండి...మరిచిపోకండి..."